వన మూలికలు

బి. రాజేశ్వరి

"మా ప్రొఫెసర్ గారు నిన్నట్నుంచీ కనిపించటంలేదు" అన్నాడు భార్గవ.

"వ్వాట్? ఎక్కడికి వెళ్ళారో చెప్పలేదా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మాళి.

"ఏం పనిమీదో చెప్పారు, ఎక్కడికో చెప్పలేదు, కాని నేను గ్రహించాను."

"ఎక్కడికి వెళ్ళారు?"

"మా రిసెర్చికి కావలసిన కొన్ని మూలికలు సేకరించటానికి ఫారెస్టుకి వెళ్ళారు."

"ఏ ఫారెస్టు?"

"దగ్గరలో వున్న। ఏజన్సీ ఏరియాకి కావచ్చునని వూహిస్తున్నాను."

"ఎప్పుడు వెళ్ళారు?"

"నిన్న తెల్లవారు ఝామున."

"కార్లో వెళ్ళారా?"

"లేదు. కారు తీసుకువెళ్ళలేదు. బహుశా బస్‌కి వెళ్ళారని అనుకున్నాను."

"అంటే బస్ ఫెసిలిటీ వున్న ఏజెన్సీ ప్రాంతానికే వెళ్ళి వుండొచ్చునని మనం వూహించవచ్చు."

"కేవలం ఊహ మాత్రమే! ఆయన ప్రయాణం ఎలా వుంటుందో మన వూహాకందదొక్కోసారి. ఒక్కోసారి కాలినడకన ఎంతదూరమైనా వెళ్ళిపోతారు. ఒకోసారి- కనీసం పదిగజాలైనా లేని దూరానికి కార్లోనే వెళ్తారు. కాలు కింద పెట్టరు. యెలా నిర్ణయించగలం?"

"ఓ.కే. మన పరిశోధన మొదలు పెట్టడానికి ఏదోక ఆధారం కావాలికదా? ఇలా జరిగివుండొచ్చునని మనం ఓ కన్‌క్లూజన్‌కి రావటం చాలా అవసరం. అప్పుడు ప్రొఫెసర్ గారిని వెదకటం సులభమవుతుంది."

భార్గవ నవ్వాడు. "ఎంతయినా రిసెర్చి స్టూడెంటువి కదా, రీజనింగ్ బాగా అలవడింది" అన్నాడు.

శాలి తను కూడా నవ్వేస్తూ, "నేనింకా రిసెర్చి చేస్తున్నాను గాని నువ్వయితే ఆల్రెడీ డాక్టరేటు తీసుకున్నావు. ప్రొఫెసర్‌కి అసిస్టెంట్‌వయ్యావు. యూ ఆర్ బెటర్ దన్ మి!" అన్నాడు.

"మనం స్నేహితులం. ఒకరినొకరు పొగుడుకోవటం కాదు, జరగాల్సింది చూడు!"

"అయామ్ రెడీ! బ్రహ్మచారిని, నా గురించి చూసే వాళ్ళెవరు? యెక్కడికి పోవాలన్నా పోగలను, ఎప్పుడు రావాలన్నా రాగలను. నువ్వే ఆలోచించుకోవాలి!"

"నాకు మాత్రం మా అమ్మ తప్ప ఎవరున్నారు? ఆమెకు చెప్పే వచ్చాను. ప్రొఫెసర్ జయవంత్ గారి భార్య, పాపం చాలా కంగారు పడుతున్నారు. ఆయన

పిల్లలిద్దరు కూడా తండ్రి రాత్రి రాకపోవటంతో బెంగ పడినట్లే కనిపించారు. చెప్పకపోవటమేం, నాక్కూడా మనసులో ఓ మూల భయంగాను, దిగులుగాను వుంది."

"అయితే ఆలస్యం దేనికి? పద వెళ్దాం" లేచాడు మాళి. భార్గవ అనుసరించాడు.

2

"తెల్లవారు ఝామున నువ్వు చెప్పిన టైంకి వున్నది ఒకే ఒక బస్సు—ఏజెన్సీ పోయేది!" అన్నాడు మాళి.

"అవును, అది మారేడుమిల్లి వెళ్తుందని చెప్పాడు కదా, కంట్రోలరు!" భార్గవ అన్నాడు.

"దీన్నిబట్టి ప్రొఫెసర్ గారు మారేడుమిల్లి వెళ్ళి వుండవచ్చునని వూహించవచ్చు!"

"అయితే మనము ముందు మారేడుమిల్లి పోయి చూద్దామా?"

"ఇక అదే చెయ్యాలి! మారేడుమిల్లి యిప్పుడిప్పుడు బాగా డెవలప్ అవుతోంది. ఇదివరకు రోడ్డుమీద అడ్డుగా పెద్ద పులులు, ఎలుగుబంట్లు పడుకుని వుండేవని రాత్రిళ్ళు ఎవరూ ఇల్లు వదిలి బయటకొచ్చేవారు కాదని చెప్పుండే వారు. ఇప్పుడు అంత ప్రమాదం లేదనుకుంటాను."

"ముందు ప్రొఫెసర్ గారు నిన్న ఆ బస్‌లో ప్రయాణంచేశారో, లేదో కనుక్కుంటే మంచిది కదూ!"

"ఎవరు చెపుతారు? ఆ డ్రైవరు, కండక్టరు ఎవరో, యీ సమయంలో యెక్కడున్నారో యెలా తెలుసుకునేది?"

"అదీ నిజమే! బస్టాండులోని పోర్టరుగాని, రిక్షా వాళ్ళుగాని యెవరైనా చూశారేమో అడుగుతాను" అన్నాడు భార్గవ.

ఓ అరగంట సేపు ఎంక్వయిరీ చేసినా ఏమీ ప్రయోజనం లేకపోయింది. ప్రొఫెసర్ జయవంత్ ని చూసిన వాళ్ళెవరూ లేరు.

భార్గవకి నీరసం వచ్చేసింది.

మాళి నవ్వాడు. "ఓ అరగంటలో బస్ వుంది. వెళ్ళి చూసొద్దామా?" అన్నాడు.

"ఓ.కే!....ప్రొఫెసర్ గారు మారేడుమిల్లే వెళ్ళారని ఎలా నిర్ణయించటం? ఇంకా యీ చుట్టుపట్ల అడవులు వున్నాయి కదా!"

"దేవీపట్నం ఏరియాలో కూడా అడవులున్నాయి. ఒకవేళ ప్రొఫెసర్ గారు అక్కడికి వెళ్ళుంటే....?"

"మారేడుమిల్లి నుంచి అక్కడికి కూడా బస్ సౌకర్యం వున్నది. అక్కడినుంచి అలా దేవీపట్నం ఏజెన్సీ ఏరియా కూడా వెరిఫై చేసుకుందాం!"

"సరే, ముందు మారేడుమిల్లి వెళ్దాం."

ఓ అరగంట తర్వాత బస్ మారేడుమిల్లి బయల్దేరింది.

3

బస్ దిగేసరికి మధ్యాహ్నం పన్నెండు కావస్తోంది. మారేడుమిల్లి మరీ వెనకబడిన ఫారెస్టు ఏరియా కాదు. అక్కడ గిరిజన కోపరేటివ్ స్టోర్సు, ఆసుపత్రి, హైస్కూలు యింకా చాలా సౌకర్యాలు వచ్చేశాయి. ప్రభుత్వోద్యోగులు వుండటానికి క్వార్టర్సు కూడా వెలిశాయి.

మారేడుమిల్లిని ఆనుకుని అనేక కుగ్రామాలు వున్నాయి. కొండలు, మిట్టలు, చిన్న చిన్న వాగులు అనేకం.

బస్ దిగుతూనే భార్గవ జయంత్ గురించి ఎంక్వయిరీ

చేశాడు. పోలికలు చెప్పినా యెవరూ మాకు తెలియదంటే మాకు తెలీదన్నారు. అలాంటి గుర్తులున్న మనిషిని ఆ ప్రాంతాల తాము చూడలేదని చాలామంది గిరిజనులు, అక్కడ నివాసముంటున్న ఉద్యోగులు చెప్పారు.

"వీళ్ళందరు యింత ఖచ్చితంగా చెప్తున్నారంటే బహుశా మీ ప్రొఫెసర్ యిక్కడికి వచ్చివుండడు" అన్నాడు మాళి.

భార్గవ సాలోచనగా తలూపాడు. "చుట్టుపక్కల యెక్కడయినా వెతుకుతున్నారేమో! లేదా మారేడుమిల్లి వచ్చేలోపల మనకు రంపచోడవరం వంటి మరికొన్ని ఏజన్సీ ప్రాంతాలు కనబడ్డాయి కదా! అక్కడెక్కడైనా మధ్యలో దిగిపోయారేమో!" అన్నాడు.

మాళి కూడా ఆలోచిస్తున్నాడు.

"ఈ చుట్టుపట్ల ఫారెస్టు యెంతవరకు వ్యాపించి వుంది?" అనడిగాడు భార్గవ-కోపరేటివ్ స్టోర్సు ఉద్యోగి నుద్దేశించి.

అతను వెంటనే, "అబ్బో, చాలా మైళ్ళుంది సార్! కొన్ని కొన్ని గ్రామాలకు-అంటే చిన్న చిన్న గూడెల మాదిరుంటాయి—కాలినడకన కూడా వెళ్ళలేం. ఎక్కే కొండ, దిగే కొండ. క్రూరజంతువులు కూడా మస్తుగా వుంటాయి. ఈ ఏరియాలో నివసించటానికి అలవాటుపడ్డ వాళ్ళు తప్ప, చీకటిపడితే ఎవరూ అటు వెళ్ళరు. వెళ్తే ప్రాణాలతో బయటపడరు!" అన్నాడు.

"చీకటిపడ్డాక పెద్దపులులవీ తిరుగుతాయంటారు, నిజమేనా?"

"పెద్దపులులే కాదు, చిరుతలు, ఎలుగ్గొడ్లు చాలా

భయంకరమైన తోడేళ్ళు, అడవి దున్నలు—ఒకటేమిటి, రకరకాల క్రూరజంతువులు. రెండు రోజులక్రితం ఓ మనిషిని చంపి తినేశాయి."

వింటున్న శ్రోతలిద్దరు ఉలిక్కిపడ్డారు.

"చంపేశాయి? ఎవరతను? ఎక్కడివాడు?" భార్గవ గొంతు తడారిపోయింది.

"అతను ఫారెస్టుగార్డు. పాపం నిండా పాతికేళ్ళు కూడా వుండవు సార్! ఆర్నెళ్ళక్రితమే పెళ్ళయింది. భార్యని కాపరానికి తీసుకొచ్చి రెండు నెలలయింది. ఇంతలోనే నూరేళ్ళు నిండిపోయాయి. ఆమె జీవితం మోడయిపోయింది."

"మరి యీ జంతువుల్ని యెవరూ చంపరా?"

"చంపటానికి వీల్లేదుగదా సార్! వన్యమృగ సంరక్షణ చట్టముంది కదండీ! చంపినవాడికి జైలు శిక్ష వేస్తారని భయపడి యెవ్వరూ వాటి జోలికి పోరు!"

"ప్రాణ రక్షణ కోసం కూడా చంపకూడదా?"

"చంపకూడదనే అంటారండి. కాని మరీ మారుమూల అడవిలో గూడెపోళ్ళు చంపేస్తుంటారండి! ఇంకా ఏనుగులు, దుప్పులు, లేళ్ళు కూడా చాలా వున్నాయండి. కొన్ని లెక్కలు వేశారు ప్రభుత్వం. చాలా జంతువులు యింకా లెక్కకు రానివి ఎన్నో వున్నాయి" అన్నాడు ఆ ఉద్యోగి.

భార్గవ తలూపి, "ఈ ప్రాంతాల వనమూలికలు అవీ విస్తారంగా దొరుకుతాయా?" అనడిగాడు.

"ఇక్కడికి దగ్గరలో కుట్రవాడ, రామన్నగూడెం ప్రాంతాల్లో దొరుకుతాయండి. చాలామంది ఆయుర్వేద మందుల్లోకి వాడటానికి మూలికలు, వేర్లు తీసుకుపో

తుంటారండి."

"సత్రంవాడ, ఆ గూడెం యిక్కడికి ఎన్ని మైళ్ళ దూరంలో వున్నాయి?"

"దాదాపు నాలుగు మైళ్ళుండొచ్చు. అంతా డొంక దారి, మెట్టదారీనండి. మీరు వెళ్ళలేరు."

"బస్ సౌకర్యం అదీ...."

"అ దడగొద్దండి. కాలినడకే శరణ్యం."

"ఆ రెండు గ్రామాలు కాక మరింకేవీ లేవా మూలికలు దొరికేవి?"

"దేవీ పట్నం ప్రాంతాల్లో కూడా దొరుకుతాయని విన్నాను. అక్కడినుంచి అదంతా గోదావరి తీరప్రాంతం. లాంచీలమీద ప్రయాణం చేసి వెళ్తుంటారు. అక్కడినుంచి రాజమండ్రి, భద్రాచలం ఇంకా ఎన్నో. తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల తీరప్రాంతాలకు లాంచీలమీదే ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటారు" అన్నాడతను.

"చాలా మంచి విషయాలు చెప్పారండీ! మేమిద్దరం రాజమండ్రినించే వస్తున్నాం. ఈయన పేరు మాళి, రిసెర్చి చేస్తున్నారు. నా పేరు భార్గవ, సైంటిస్టుని. మా ప్రొఫెసర్ గారు మూలికాన్వేషణలో ఈ అడవిప్రాంతాల కొచ్చారు. ఆయన రెండురోజులుగా తిరిగి రాలేదు. అప్పుడు వారిని వెతుక్కుంటూ మేము వచ్చాము" అన్నాడు భార్గవ.

"చాలా సంతోషం సార్! మీలాంటి పెద్దవారిని కల్సుకునే భాగ్యం కలిగింది. నా పేరు సంతాల్" అన్నాడు ఆ ఉద్యోగి సంతోషం వ్యక్తపరుస్తూ.

ఇంతలో అక్కడికి ఓ ముప్ఫయ్యేళ్ళ యువకుడు వచ్చాడు ఏవో సరుకులు కొనటానికి.

సంతాల్ అతని వ్యాకలసినవి యిస్తూ "అన్నట్టు యీాయనకు తెలియకచ్చునండీ — యీాయన మలేరియా ఉద్యోగి. వ్రగామాలన్నీ సర్వే చేస్తాడు.... చూడు, రంగా, నీవు రామన్నగూడెం అదీ తిరుగుతావు కదా, యీా రెండు రోజులుగా నీకు అక్కడ ఎవరైనా ప్రొఫెసరుగారు కనిపించారా?" అన్నాడు.

ఆ ఉద్యోగి-రంగా-"పోలికలు చెప్పండి" అన్నాడు.

భార్గవలో ఆశ మొలకెత్తింది. ప్రొఫెసర్ జయవంత్ పోలికలు చెప్పాడు.

రంగా వెంటనే, "సరిగ్గా యిలాంటి పోలికలున్న మనిషిని చూశానండి. నిన్న రామన్నగూడెంనించి బోయిగూడెం వెళ్తూండగా, మెట్టవైపు వెళ్తూ ఒకాయన కనిపించాడు. ఆయన చేతిలో భూతద్దం, చిన్న సూట్ కేసు వున్నాయి. నేలమీద వంగి ఏదో పరీక్షగా భూతద్దంతో చూస్తూ కొన్ని మొక్కల్ని తీసి సూట్ కేసులో వేస్తూ కనిపించాడు. ఎవరో ఆయుర్వేద వైద్యుడయి వుంటాడనుకున్నాను" అన్నాడు.

"నిన్న ఎన్నిగంటలకు చూశారు?" భార్గవ గుండె దడదడ కొట్టుకుంటోంది.

"పదిన్నర—పదకొండు మధ్య, ఓ మలేరియా రోగికి రాడికల్ ట్రీట్ మెంటు యిచ్చివస్తున్నానండి. ఇక్కడ చాలా మలేరియా కేసులున్నాయండి, పోజిటివ్ కేసులు! దాంతో నేను ఈ ఏరియాలోని గూడేలన్నిటికీ తిరుగుతుంటాను" అన్నాడు రంగా.

"అయితే, ఆయన తర్వాత మళ్ళీ కన్పించారా?"

"లేదండి."

"మీరు చూసిన ప్రాంతం ఏ గ్రామంలోది?"

"రామన్న గూడెంది."

"ఇక్కడికి యెన్ని మైళ్ళుంటుంది?"

"మూడున్నర నాలుగు మైళ్ళుండొచ్చు. వస్తాను సార్, మళ్ళీ మరో పాజిటివ్ కేసుకి ట్రీట్ మెంటివ్వాలి" రంగా వెళ్ళిపోయాడు.

సంతాల్, భార్గవవంక చూసి, "మీకు ఈ ప్రాంతం బాగా తెలిసిన కుర్రాడిని తోడిస్తాను. వాడు మీకు ఈ గట్లు పుట్టలు మెట్టలు అన్నీ చూపిస్తాడు. దారి చూపిస్తాడు!" అన్నాడు.

మాళీ ఆనందంగా సంతాల్ వంక చూసి, "మీ మేలు మరిచిపోం. మేం మీ దగ్గరకొచ్చి చాలా మంచి పని చేశాం. ఇంత నిస్వార్థంగా సేవచేసేవాళ్ళు చాలా అరుదుగా వుంటారు" అన్నాడు.

సంతాల్ సిగ్గుపడి, "నన్నూరికే పొగిడెయ్యకండి సార్, గర్వం వచ్చేస్తుంది" అన్నాడు.

ఈలోపల పని కుర్రాడు వచ్చాడు. పదేళ్ళుంటాయి.

సంతాల్ వాడిని పిలిచి, "వీడే సార్. పేరు అర్జున-అర్జునుడికన్న చురుకైనవాడు. ఈ అడవిలో పుట్టి పెరిగిన వాడు. మీకు అడివంతా ఒక్క రోజులో చుట్టి చూపించెయ్యగల చిచ్చర పిడుగు ...అరే అర్జునా, దొరలతో వెళ్ళి రామన్నగూడెం అయ్యా జూపిస్తావా?" అన్నాడు వాడి భాషలో.

"గట్టనే దొరా? ఏంగావాలి అయ్యలకు?" అన్నాడు అర్జున. వాడి ఒంటిమీద చిన్న గోచీపాత, తలకి చిన్న గుడ్డ వున్నాయి—అంతే!

"ఏం లేదులే, మన్నెం జూడాలని వచ్చిన్రు వెంట బెట్టుకు జూపిస్తావా?"

"గట్టనే దొరా! వొసురా?"

"గిప్పుడు గాదులే, గూసింత బువ్వ తిన్నక వొస్తారు."

"గట్టనే!" అన్నాడు అర్జున.

మాళి, భార్గవల గుండెలు సంతాల్ పట్ల కృతజ్ఞతతో నిండిపోయాయి.

4

గంట తర్వాత మాళి, భార్గవ, అర్జున బయల్దేరారు.

"మీరు ఆ పని చూసుకుని చీకటి పడ్తుండగా తిరిగొచ్చెయ్యండి సార్! ఈలోపల మీకు ఇన్‌స్పెక్షన్ బంగళాలో రూం మాట్లాడి వుంచుతాను. ప్రొఫెసర్ గారి ఆచూకీ తెలిస్తే సరే లేకుంటే యింకా చుట్టుపట్ల వెతకాల్సి వుంటుంది కదా!" అన్నాడు సంతాల్.

"అవును ప్రొఫెసర్ గారు దొరికితే రాత్రికి వుండే పనిలేదు. దొరక్కపోతేనే సమస్య...."

"మీరేం బెంగపడకండి. ఈలోపల నేను చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చే గిరిజనుల్ని ఎంక్వయిరీ చేస్తాను. సరుకులు తెచ్చి స్టోర్సుకి అప్పచెపుతుంటారు కదా, నా దగ్గరికి దాదాపు అన్ని గూడేలనుంచి మనుషులు వస్తుంటారు. ఈ చుట్టుపక్కల అడవిలో ఏ మూల వున్నా మీ ప్రొఫెసర్ గారి విషయం వీళ్ళు చెప్పేస్తారు" అన్నాడు సంతాల్.

ముగ్గురు బయల్దేరారు.

రామన్నగూడెం చేరేసరికి సాయంత్రం నాలుగు అయింది. అంతా డొంకదారి, ముళ్ళకంపలు, రాళ్ళు రప్పలు దాటుకుని నడవటం వాళ్ళిద్దరికీ చాలా కష్టమైంది.

అర్జున చెంగు చెంగున దూకుతూ వాళ్ళిద్దరికంటె పది గజాలు ముందుండేవాడు. వాడినందుకోవటం యిద్దరికీ

సాక్ష్యంకాలేదు.

అర్జున గూడెం ప్రజల్ని ప్రొఫెసర్ గురించి అడిగాడు. వాళ్ళ మాటలు మాళి, భార్గవలకు చాలా భాగం అర్థం కాలేదు. అందుకే ముందుగా తా మొచ్చిన పని గురించి అర్జునకి చెప్పి, ప్రొఫెసర్ పోలికలు వివరంగా, అలాంటి మనిషిని ఆ గూడెం ప్రజలెవరైనా చూశారేమో కనుక్కోమని చెప్పారు. అర్జున వాళ్ళు అడగమన్నట్టే అక్కడి ప్రజల్ని అడుగుతూ వచ్చాడు.

ఒక ముసలతను మాత్రం సమాచారం యిచ్చాడు.

“నిన్న మద్దేల జూసినాను దొరా! అచ్చం నువు జెప్పినట్టే వున్నాడు. నిన్న సందేలదాకా యిట్టట్టే దిరిగి నడు” అన్నాడు.

ఆ తర్వాత ప్రొఫెసర్ని చూసినట్టు యెవరూ చెప్పలేకపోయారు.

భార్గవ, మాళి నిరాశపడిపోయారు.

అర్జున ప్రశ్నార్థకంగా చూశాడు వాళ్ళ వంక.

“తిరిగి బోదామా దొరా?” అన్నాడు. అప్పటికి చీకటి పడిపోయింది.

“దాదాపు రెండుగంటల ప్రయాణం. వెళ్దామా, యిక్కడే ఆగిపోదామా?” అన్నాడు భార్గవ.

“సంతాల్ మనకోసం బంగళా రూం తీసుకుంటానన్నాడుకదా! ఈ రాత్రికి మారేడుమిల్లిలోనే గడిపేద్దాం” అన్నాడు మాళి.

“అది సరే, అసలు యిప్పుడు మారేడుమిల్లి వెళ్ళగలమా? బాగా చీకటి పడిపోయిందికదా!”

“మరి ఈ అడవిలో ఎక్కడుంటాం?”

అర్జున కలుగజేసుకుని “యిక్కడ కాపలా మడిసుందే

పోతుందిగదా దొరలూ!" అన్నాడు.

మాళి చిన్నగా నవ్వి, "అక్కడెవరుంటారు?" అన్నాడు.

"కాపలా మడుసులిద్దరుంటారు. ఆళ్ళలో పెద్ద ఇల్లుండది" అన్నాడు అర్జున.

"ఫారెస్టు తాణా అనుకుంటాను. ఫారెస్టు గార్డు వుండివుంటాడు" అన్నాడు మాళి.

"రిస్క తీసుకుని ఈ టైంలో మారేడుమిల్లి వెళ్ళేబదులు, ఆ ఫారెస్టు తాణాలో ఈ రాత్రి గడిపేసే మంచిది కదూ! జయవంత్ గారు ఈ ప్రాంతాలనే యెక్కడో తప్పిపోయారన్నది నిర్వివాదాంశం. నిన్న సాయంత్రనించి ఆయన్ని చూసినవారు లేరు. అంటే ఆయన ఈ పరిసరప్రాంతాల యెక్కడో వుండివుండాలి. ఫారెస్టు తాణేదారు మనకేమైనా చెప్పగలదేమో అదీ చూడొచ్చు" అన్నాడు భార్గవ.

ఇద్దరు అర్జున దారిచూపగా ఫారెస్టు తాణా చేరారు. తాణేదారు వాకిట్లోనే వాళ్ళను నిలేశాడు.

భార్గవ తమను పరిచయం చేసుకున్నాడు. "నిన్న సాయంత్రం ఈ ప్రాంతాల మా ప్రొఫెసరుగారు మూలికల సేకరణకు రావటం చూసినవాళ్ళు చెప్పారు. మీకుగాని కనిపించారేమో కాస్త గుర్తుచేసుకు చెప్పండి" అన్నాడు.

"సారీ, అలాంటి మనిషినెవర్నీ నేను చూళ్ళేదు" అన్నాడు తాణేదారు సంభాషణ తుంచేస్తూ.

అర్జున తాణేదారుకి దండంపెట్టి, "దొరా, పొద్దోయింది. ఈ రేతిరికిక్కడుంటరంటి దొర్లు!" అన్నాడు.

"అదెలా కుదుర్తుంది? నేను, గార్డు తప్ప యిక్కడ

బయటివాళ్ళెవరూ వుండటానికి వీల్లేదు. అది రూలు!" అన్నాడు తాణేదారు నిర్మొగమాటంగా.

మాళి, భార్గవ ముఖాలు చూసుకున్నారు.

"ఈ టైంలో మా రేడుమిల్లి తిరిగి వెళ్ళటం కష్టమనీ, రిస్కు తీసుకోవటమెందుకని ఇక్కడ ఈ రాత్రి గడపాలనుకున్నాం" అన్నాడు భార్గవ.

"చెప్పానుగా, వీలుకాదని!" మొహమ్మీద కొట్టినట్టు చెప్పి లోపలికి వెళ్ళిపోయిన తాణేదారు సంస్కారం ఏ పాటిదో వాళ్ళకి అర్థమయిపోయింది.

"పద భార్గవా, ఈ తాణేదారుకన్న అడవి జంతువులు క్రూరమైనవి కావు" అన్నాడు మాళి.

"రండి దొరా, నే నే తోల్కపోతాను. ఓ గడీసేపు నడిచారంటే సరిపోద్ది!" అన్నాడు అర్జున ముందుకి దారి తీస్తూ.

ఆ అడవిలో తమకు అండదండగా వున్నది ఆ సమయంలో అర్జున ఒకడే! వాడు కూడా లేకపోయివుంటే తమకా నిర్జన ప్రదేశంలో దిక్కేది?

మాళి భార్గవల మనసుల్లో అర్జున అక్కడి కొండకన్న ఉన్నతంగా కనిపించాడు.

5

అర్జున ముందు దారితీస్తుండగా వెనక వాళిద్దరూ నడుస్తున్నారు.

అప్పటికి రాత్రి ఎనిమిది కావస్తోంది. చీకటి రాత్రులు కావటంతో చుక్కల గుడ్డి వెలుతురు తప్ప వెలుగు కన పడటంలేదు. డొంకదారి రాత్రి సమయంలో మరింత భీభత్సంగా వుంది. పక్కలకు చూడాలంటేనే భయం కొలిపేలాగా జుట్లు విరబోసుకున్న దయ్యాల్లా వున్నాయి

దట్టమైన చెట్లు.

అర్జున చటుక్కున ఆగిపోయాడు.

మాళి, భార్గవ కూడా చటుక్కున ఆగిపోయారు.

అర్జున చెవులు రిక్కించాడు. ఏవో అరుపులు. అరుపు కాదు గాండ్రింపు, పులి గాండ్రింపు!

మాళి, భార్గవల గుండెలు అవిసిపోయాయి.

"పులి ఒస్తన్నాది దొర్లూ! మీకు చెట్టెక్కడం వొచ్చా?" అడిగాడు అర్జున వాళ్ళిద్దరికైపు పెద్ద ఆరిందా లాగా చూస్తూ.

"వచ్చు" అన్నారిద్దరం.

"అవుతే వెంటనే ఈ సింతసెట్టెక్కెయ్యండి. పులొత్తే మీద పడిపోద్ది" అన్నాడు అర్జున.

వాడిమాటలింకా పూర్తికానేలేదు. గాండ్రుమంటూ పెద్ద పులి పరుగెత్తుకుంటూ వచ్చింది. మనిషి రక్తానికి అలవాటుపడ్డ పులి. మనిషి జాడ పొడకడితే చాలు వచ్చి మీద పడిపోతుంది.

"ఎక్కండి బాబూ ఎక్కండి" అరిచాడు అర్జున.

మాళి, భార్గవ చెట్టెక్కబోతూ జారిపోయారు.

పులి దగ్గరకొచ్చేసింది.

మరు క్షణంలో మాళి, భార్గవలమీద ఉరికేదే!

కాని ఈ లోపల అనుకోని విధంగా అర్జున పులికీ, వాళ్ళిద్దరికీ మధ్య అడ్డొచ్చేశాడు.

పులి అర్జునమీదికి పంజా విసిరింది.

అర్జున కింద దొర్లుతున్నట్టుగా ఒకసారి దొర్లి పులి దృష్టిని మరలించాడు.

పులి దృష్టి అర్జునమీద కేంద్రీకృతమైంది.

ఈ లోపల మాళి, భార్గవ చెట్టెక్కేసి, కొమ్మల

మధ్యకు వెళ్ళి దాక్కున్నారు.

అర్జున చెంగు చెంగున లేడిలా గెంతుతూ పులికి దొరక్కుండా అడివంతా కలియతిరగేస్తున్నాడు. పులి వాడి వెంటపడి వేటాడుతోంది.

అర్జున దానికి దొరకటంలేదు. పులి మహా క్రోధంతో గాండ్రిస్తోంది.

అర్జున దార్లో కనపడ్డ ఓ చెట్టు ఎక్కటానికి ప్రయత్నించాడు. మొదలు పట్టుకుని చకచకా ఎక్కాడు. కాని అప్పటికే సమయం మించిపోయింది.

కోపంతో వున్న పులి మహోద్రేకంతో పంజా విసిరింది.... దాని దెబ్బకు అర్జున పట్టుజారి దబ్బున కింద పడిపోయాడు.

పులి ఒక్క క్షణంలో అర్జునమీదికురికి కంఠం కొరికేసింది. క్షణాల్లో ముక్కలు ముక్కలుగా చీల్చేసింది వాడ్ని-అరిచేందుకూడా టైంలేదు!

దూరంనించి కొమ్మల మధ్యగా కూచుని చూస్తున్న మాళి, భార్గవల గుండెలు చెదిరిపోయాయి. మనసులు మూగగా రోదించాయి. తమకు సాయంగా వచ్చిన ఆ చిన్నారి అడవి కూన తమను రక్షించే ప్రయత్నంలో ఘోరంగా ప్రాణాలు కోల్పోయాడు.

వాళ్ళ కళ్ళనుండి అప్రయత్నంగానే కన్నీరు ధార కట్టింది. మనసులు మూగబోయాయి. కంఠం రుద్ధమాయిపోయింది.

పులి అర్జున కళేబరాన్ని లాక్కుని మహా వేగంతో పొదల మధ్యకు ఈడ్చుకుపోయింది.

కొద్ది క్షణాలవరకు చెంగున లేడి కూనలా గంతులు

వేసి తమతో కలిసివున్న అర్జున చరిత్ర శాశ్వతంగా ముగిసిపోయినందుకు, అందుకు కారణం తామే అయినందుకు భార్గవ, మాళి — మనసులోనే తమని తాము నిందించుకున్నారు. పాపం, వాడి అమ్మా నాన్నా ఎవరో, ఏమిటో? సంతాల్ కి వాడు ఏమయినా బంధువో, చుట్టమో — ఏమీ తెలీదు.

సంతాల్ కి ఏం సమాధానం చెప్పాలి? ఒక నిండు ప్రాణానికి విలువకట్టడం ఎవరితరం?

అడవిలో మళ్ళీ భయంకర నిశ్శబ్దం తాండవిస్తోంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఏవో లారీల ఇంజను చప్పుళ్లు వినిపించాయి వాళ్ళకి.

భార్గవ చప్పున అటు చూపించి, "మాళీ, ఆ లారీల వెంట వున్న మనిషి తాణేదారులా లేడూ?" అన్నాడు.

మాళి గుర్తుపట్టి "అవును! చూడబోతే అడవి సంపద దొంగతనంగా రవాణా అవుతున్నట్టనిపిస్తోంది నాకు! విద్రోహులతో థాణాదారు చేయికలిపినట్టు కనిపిస్తోంది!" అన్నాడు.

"ఎగ్జాట్లీ! అదిగో చందనం చెక్కలు కాబోలు లోడ్ చేస్తున్నారు. కచ్చితంగా అక్రమ రవాణాయే!"

"నాకిప్పుడు అర్థమయింది వాడు మనకి ఆశ్రయమివ్వటానికి ఎందుకు నిరాకరించాడో....?"

"వాడి సంగతి బయటపడిపోతుందని భయపడ్డాడు. ఈ రవాణా విషయం ముందే నిర్ణయమైపోయి వుంటుంది కదా!"

"రాస్కెల్! ప్రభుత్వాన్ని కళ్ళుగప్పి మోసంచేసి తన కడుపు నింపుకుంటున్నాడు. దేశద్రోహి! ఇలాంటి వాడ్ని పట్టి పోలీసులకి అప్పగించాలి!"

"సరే, అది మన పని కాదు. అందుకు వేరే డిపార్టుమెంటుంది. ప్రస్తుతం మా గురువుగారి విషయం చూసుకుంటే, అనక యిలాంటి ద్రోహుల విషయం తీరిగ్గా ప్రభుత్వానికి తెలియచేద్దాం."

మాళి ఏదో చెప్పటానికి తెరిచిన నోరు అలాగే వుండిపోయింది. భార్గవ ప్రశ్నార్థకంగా చూశాడతనికేసి. మాళి కళ్ళతోనే సూచించాడు.

అటు చూసిన భార్గవ గుండె ఝల్లుమంది. ఏదో నల్లటి ఆకారం వెనుక కాళ్ళమీద వాళ్ళు కూచున్న చెట్టెక్కుతోంది. అదేమిటో వెంటనే గుర్తించారు వాళ్ళు!

ఎలుగుబంటి! అడవిలో తిరిగే ఎలుగ్గొడ్లు ప్రమాదకరమైనవని తను విని వుండటంతో మాళి హెచ్చరికగా పొడిచాడు భార్గవను మోచేత్తో!

"కిందికి ఉరికేద్దామా? అన్నాడు భార్గవ.

ఎలుగుబంటి వీళ్ళిద్దర్నీ చూసిందనటానికి నిదర్శనంగా, అది సరాసరి వాళ్ళు కూచున్న కొమ్మవైపు చురుగ్గా వచ్చేస్తోంది. టైం లేదు.

ఇద్దరు కొమ్మల్ని వాటంగా పట్టుకుని చటుక్కున నేలమీదికి జారారు. కాళ్ళకి నేల అందలేదు. కింద ఏముందో తెలీదు. అయినా తప్పదు, ఎలుగ్గొడ్డు గుర్రుమంటూ వచ్చేస్తోంది.

చటుక్కున కొమ్మలు వదిలేసి ఉరికేశారు.

వెంటనే కాళ్ళు స్వాధీనంలోకి రాలేదు. ఎలుగ్గొడ్డు వాళ్ళని వదల్లేదు. చకచకా చెట్టు దిగిపోయింది.

ఈ లోపల, మాళి, భార్గవ ముందుకు పరుగులు పెట్టారు. ఆ చీకట్లో ఎటు పరుగెడుతున్నారో, ఎదుట ఏముందో కూడా వాళ్ళకు తెలియటంలేదు. ముందీ ఎలుగు

వారినుండి తప్పించుకోవాలి, అంతే!

ఒక్క క్షణం ఆగి వెనక్కి తిరిగి చూశారు.

ఎలుగుబంటి జాడ లేదు.

ఇద్దరు ఆగి అలుపు తీర్చుకున్నారు కాసేపు.

చుట్టూ చూశారు. అది తాము వచ్చిన దారి కాదు. అర్జున తీసుకునివచ్చిన దారి గుర్తుపెట్టుకున్నా రిదివరలో. ఇప్పుడు తామున్న ప్రదేశం పూర్తిగా గుర్తు తెలియనిది!

"ఏం చేద్దాం? ఈ రాత్రికి ఎక్కడ గడపాలి?" అన్నాడు భార్గవ ఆయాసం తీరాక.

మాళి వెంటనే సమాధానం చెప్పలేదు.

"ఏదైనా చెట్టెక్కి తెల్లవారేవరకు ప్రాణ రక్షణ చేసుకుంటే మంచిదేమో!" అన్నాడు భార్గవ మళ్ళీ.

మాళి నోరు తెరిచి ఏదో చెప్పేంతలో వాళ్ళిద్దరి మీదా ఎక్కడినుంచో వెలుగు ఫోకస్ అయ్యింది.

త్రుళ్ళిపడ్డారిద్దరు. ఇంజను శబ్దం వినిపించింది.

"ఓహో, ఇందాక మనం చూసిన లారీలయివుంటాయి. లోడింగ్ అయినట్టుంది" అన్నాడు మాళి.

"ఓ అయిడియా?"

"ఏమిటది?"

"ఈ లారీల వెనక వెళ్ళాడి రోడ్ చేసుకుందామా? ఇవి బహుశా మారేడుమిల్లి నుంచే కదా వెళ్ళాల్సి వుంటుంది?"

"ఏమో, వీటికి రహస్య మార్గాలేమైనా వున్నాయేమో? వీటిని నమ్ముకుంటే మరో గుర్తు తెలీని చోటుకి పోయే ప్రమాదముంది."

"నిజమే! ఈలోపల డ్రైవరుగాని ఇంకా లారీ వెంట వున్నవాళ్ళుగాని చూస్తే మనల్ని ఆన్ ది స్పాట్ చంపి

పారేస్తారు! అసలే స్మగ్లర్స్. దయాదాక్షిణ్యం, కనికరం అనే పదాలకు వీళ్ళకి అర్థం తెలీదు!"

"పక్కకు ఆ పొదల మధ్యకు తప్పుకుందాం. ఆ లారీలు దగ్గరవుతున్నాయి. మనల్ని చూశారంటే ఇక్కడే పాతేస్తారు."

ఇద్దరు గుబురుగా వున్న పొదల పక్కకు తప్పుకున్నారు.

రెండు లారీలు నిండు గర్భిణీల్లాగా మెల్లగా సాగిపోయాయి.

6

"మాలీ, టైమెంతయిందో చూడు!"

"పన్నెండు కావస్తోంది."

"అంటే కనీసం అయిదు గంటలు గడిస్తేనేగాని తెల్లవారదు."

"వాతావరణం చాలా భయంకరంగా కనిపిస్తోంది కదూ! ఏ ప్రమాదమూ లేకుండా ఈ రాత్రి గడుస్తుందనుకోను."

"ఆశ్చర్యపడితే ఎలా? చూదాం, మన అదృష్టమెలా వుందో?"

"మనం వెంట ఏమైనా ఆయుధాలవంటివైనా తెచ్చుకున్నాం కాదు. పెద్ద హీరోల్లా బయల్దేరి వచ్చేశాం చేతులూపుకుంటూ!"

"మనం యిలాంటి పరిస్థితుల్లో యిరుక్కుంటామని ఏమన్నా కలగన్నామా?"

"జాగ్రత్త! కన్ను మూశావంటే కలలూ వస్తాయి, కిందపడి కాళ్ళు చేతులూ విరగ్గొట్టుకుంటావు!" మాలి హెచ్చరికతో కొమ్మల మధ్య సరిగ్గా సర్దుకుని చేరగిల

బడ్డాడు భార్గవ.

"అటు చూడు, ఎవరో యిటే వస్తున్నట్టనిపించటం లేదూ....?" అన్నాడు భార్గవ.

మాళి పరికించి చూసి, "అవును. ఎవరో మనిషయితే కదిలి వస్తున్నాడు. జాగ్రత్త, అలికిడి చెయ్యకు. ఆ మనిషి యెలాంటి వాడో, ఏమిటో....?" అన్నాడు.

కాసేపటికి ఆ ఆకారం దగ్గరయ్యింది.

అతని ఒంటిమీద ఏదో జంతు చర్మం నడుం చుట్టూ కట్టుకున్నాడు తప్పితే ఏ విధమైన ఆచ్ఛాదనాలేదు. అతను జుట్టు చాలా పొడవుగా ఆడవాళ్ళ జుట్టుకన్న పొడవుగా వుంది. అట్టలు కట్టివుంది. నుదుటిమీద సింధూరంతో పెట్టుకున్న బొట్టు ఆ చీకట్లో కూడా చాలా ఎర్రగా కనిపిస్తోంది. ఒడలునిండా విభూతి కాబోలు పూసుకున్నాడు.

చేతిలో ఏవో పుర్రెలు, యెముకలు వున్నాయి. పుర్రెలో ఏదో ఎర్రటి ద్రవం కనిపిస్తోంది. మనుషి చాలా భయంకరంగా వున్నాడు.

మాళి, భార్గవ ఊపిరి బిగించి అతనివంకే చూస్తున్నారు.

"ఎవడో మాంత్రికుడిలా వున్నాడు" అన్నాడు మాళి.

"చిన్నప్పుడు చదువుకున్న బేతాళ మాంత్రికుడి కథలు గుర్తొస్తున్నాయి."

"ఎవడో క్షుద్రదేవతా ఉపాసకుడిలా వున్నాడు. అందులోనూ ఆటవిక జాతికి క్షుద్ర దేవతలే ఆరాధనీయులు. పుట్టలకి, కొండలకీ, చెట్లకీ మొక్కుతారు. జంతు బలులు యథేచ్ఛగా యిస్తుంటారు. ఆ దేవతల

క్రీత్యర్థం!"

"ఏదూ అలాంటివాడేననిపిస్తోంది జంతు బలులతో బాటు నర బలులు కూడా యిస్తుంటారని విన్నాను. ముఖ్యంగా మారుమూల కొండ ప్రదేశాల్లోని కోయ వాళ్ళు యిప్పటికీ పురాతన ఆచారాలను పట్టుకు వేళ్ళాడు తుంటారనీ, నరబలులివ్వటం చాలా సాధారణమైన విష యంగా భావిస్తారనీ విన్నాను."

"ష్!....వాడు పంతం పట్టినట్టు సరాసరి మన చెట్టు కిందకే వస్తున్నాడు. ఏ మాత్రం మాట బయటికొచ్చినా మన ఉనికి గుర్తుపట్టి తాట ఒలిచేస్తాడు."

"ఎస్. బీకామ్!"

ఇద్దరు మౌనం వహించారు.

ఆ మాంత్రికుడిలాంటి మనిషి తిన్నగా మాళీ, భార్గవులు కూచున్న చెట్టుకిందనే వచ్చి నించున్నాడు. అతని నడుంచుట్టు కట్టుకున్న చర్మం విప్పాడు. దానికింద మరో చర్మముంది—జింక చర్మం.

విప్పిన చర్మం నేలమీద పరిచి దానిమీద కూచు న్నాడు. పుర్రెను కింద పెట్టాడు. ఎముకల్ని ఖాళీ పుర్రెల్ని చెట్టు మొదలుకి చేరవేసి వాటికి బొట్లు పెట్టాడు సింధూరంతో.

పుర్రెలో వున్న ఎర్రటి ద్రవాన్ని ఓ ఎముకతో తీసి నేలమీద చుక్కలుగా పడేలా చేశాడు. చిత్రంగా ఆ చుక్కలన్నీ క్షణాలమీద ఆవిరైపోయాయి. ఏవో మంత్రాలు చదివాడు.

ఆ పుర్రెలోని ద్రవం నెత్తురని గ్రహించటానికి మాళీ భార్గవులకు యెక్కువ సమయం పట్టలేదు. ఇద్దరు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఇది మనిషి రక్తం కాదు

గదా!

ఇద్దరి మనసుల్లోనూ తేలుకొండీలాంటి ప్రశ్న తలెత్తింది.

మనిషి రక్తమే అయితే, కొంపతీసి....?

అంతవరకూ ఆలోచించటానికి ఇద్దరికీ భయంవేసింది.

ఆ మంత్రగాడు తన కార్యక్రమాన్ని అలా నిర్వర్తిస్తూనే వున్నాడు.

దాదాపు రెండు గంటలు సాగింది.

మళ్ళీ, భార్గవ ఊపిరి గట్టిగా విడవటానిక్కూడా భయపడుతున్నారు.

ఉన్నట్టుండి ఆ మంత్రగాడు పైకి లేచాడు. గాలిలో ఏదో అలజడి వచ్చినట్టు వినిపించింది. వాతావరణంలో వచ్చిన భేదం స్పష్టంగా తెలుస్తోంది వాళ్ళకు. గాలిలో ఏవో అస్పష్టమైన శబ్దాలు కూడా వినిపిస్తున్నాయి. ఏవో గుసగుసల్లాగా యెవరో మాట్లాడుకుంటున్నట్టు వున్నాయా శబ్దాలు.

బహుశా మాంత్రికుడు స్పిరిట్స్‌తో మాట్లాడటం లేదు కదా! క్షుద్ర దేవతోపాసకులకు చనిపోయినవారి ఆత్మలతో మాట్లాడే శక్తి అలవడుతుందనీ, దాని సాయంతోనే వాళ్ళు కావలసిన పనులు కూడా చేయ గలుగుతారనీ తాము విన్న చదివిన సంఘటనలు వాళ్ళిద్దరి మనసుల్లోను మెదులుతున్నాయి.

మాంత్రికుడు కింద పేర్చిన పుర్రెలనీ, ఎముకలనీ తీసుకున్నాడు. కిందపరచిన చర్మాన్ని మళ్ళీ నడుముకు కట్టేసుకున్నాడు. పుర్రెలో మిగిలిన రక్తాన్ని ధారగా నేల మీదకు వదిలేశాడు. అయితే ఆ రక్తం నేలమీదకు జారకుండానే ఆవిరైపోవటం చూసి యిద్దరికీ గుండె

లవిసిపోయాయి.

క్షుద్ర దేవతలు పిల్చేస్తున్నాయా? ఏమో....?

మాంత్రికుడు కదిలి వెళ్తున్నాడు. నోరు తెరిచి ఏదో మాట్లాడుతున్నాడు. అంతవరకు వినిపించిన గాలిలోని శబ్దాలు అతనితోనే దూరమయిపోయాయి.

మళ్ళీ, భార్గవ గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు.

"నాకు చాలా భయం వేసింది. అతను మనల్ని ఎక్కడ గమనించి భస్మం చేసేస్తాడోననిపించింది" అన్నాడు భార్గవ.

"నిజానికి అంతే మరి! ఈ మంత్రగాళ్ళని నమ్మడానికి వీల్లేదు. అదీగాకుండా వీళ్ళు నరమాంస భక్షకులు కూడా అయివుంటారు. క్షుద్ర దేవతలకు మానవ రక్తంతో తర్పణం చేసి, మాంసాన్ని ఆరగిస్తారని నువ్వు వినలేదా? అందునా యిలాంటి అనాగరిక అడవి మనుషులు మరీ డేంజర్!"

"మా గురువుగారికేదైనా ప్రమాదం సంభవించ లేదుకదా!....నా మనసు కీడు శంకిస్తోంది" భార్గవ చెప్పలేక చెప్పాడు.

"ఏమో, ఈ మంత్రగాడిని చూశాక నాకూ భయం పుట్టుకుంది. ప్రొఫెసర్ గారి విషయం కూడా అనుమానాస్పదమే!"

"నువ్వు నా ధైర్యాన్ని మరింత దిగజార్చుతున్నావు. ప్రొఫెసర్ గారు క్షేమంగా వుండాలని భగవంతుడ్ని కోరుకుంటున్నాను. ఆయనకేదైనా అయితే ఆయన్ని నమ్ముకున్న భార్యాబిడ్డలు నేనూ యేమయిపోతాం?"

"ఆయన క్షేమంగా వుండాలనే ఆశిద్దాం! పోతే నిండు ప్రాణాన్ని చేతులారా పోగొట్టుకున్న అర్జున

విషయం తలుచుకుంటే నా గుండె చెదిరిపోతోంది. సంతాల్ కి యేమని సమాధానం చెప్పాలి? మనల్ని నమ్మి మనకు తోడుగా ఆ కుర్రాడ్ని పంపితే, మనకోసం బలి పెట్టేశాం కుర్రాడ్ని. యిప్పటికీ ఆ దృశ్యం తలుచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

"ఏమైనా సంతాల్ కి తెలియచెయ్యటం మన విధి!"

"కరెక్టేననుకో! అసలు ముందీ గండంనించి బయట పడగలమా?—అని తెల్లవారాక దారి గుర్తు దొరికితే తప్పకుండా సంతాల్ ని కలియాల్సిందే!"

"ఇంకా తెల్లారటానికెంత టైముంది?"

మాలి రేడియం డైల్ వాచీ చూసి, "ఇంకో రెండు గంటలు. ఇంకేవిధమైన అవాంఛనీయ సంఘటనా జరక్కపోతే యీ రేయి తెల్లవారుతుంది! మనం సూర్యుడ్ని చూడగలుగుతాం" అన్నాడు.

7

ప్రొఫెసర్ జయవంత్ బోనులో వున్న ఆ గుహలో అటు యిటు పచార్లు చేస్తున్నాడు.

తనపాలిటకిదొక బందిఖానా! గుహ బయట దయ, కనికరంలేని అడవి మనుషులు కాపలా!

తెల్లవారితే తనను కొండదేవరకి బలిస్తారు. ఈ అటవికుల అజ్ఞానానికి, మూర్ఖత్వానికి వాళ్ళమీద వాళ్ళ నాయకుడిమీద చాలా కోపం వచ్చిందాయనకు.

అసలు, రెండు రోజులక్రితమే తనను బలిచ్చివుండే వాళ్ళు! కాని, యీ రోజువరకు వాయిదా వేశారు.

తను ఎన్నో విధాల నాయకుడికి నచ్చచెప్పాడు. తను నిజంగా మూలికలకోసమే అడవికి వచ్చాననీ, అవి వెతుక్కుంటూనే గూడెం వున్న ప్రాంతానికి వచ్చాననీ,

తనను వదిలిపెట్టాల్సిందనీ కోరాడు.

"నువ్వు చెప్పేదేదీ నమ్మటానికి వీల్లేకుండా వుంది. మా కొండదేవరకూ కోపమొచ్చినాది. నిన్నిక పేనాల్తో ఒగ్గం" అన్నాడు నాయకుడు.

తను విసిగివేసారిపోయాడు. గూడెంలో ఎవరూ చదువుకున్నవారే కనపడలేదు. ఆ నాయకుడు పరమ మూర్ఖుడిలా వున్నాడు. ఎన్ని విధాల చెప్పినా తన పట్టు వదల్లేదు.

"ఇయ్యాల నిన్ను బలేసేవోళ్ళంగానీ, ఎల్లుండు మావ గూడెంలో జాతరుంది. అప్పుడేత్తాం నిన్ను బలి! ఈ లోగడ బాగా కొవ్వెక్కే తిండి పెడతాం, తినుకో!" అన్నాడు నాయకుడు.

తర్వాత యిద్దరు ఆటవికులు తనని చెరో రెక్కా పట్టుకుని యీ గుహలోకి లాక్కొచ్చి పడేశారు. బయట బల్లేలు పట్టుకుని పహారా తిరుగుతున్నారు. ఎందుకో తనంటే యింత కక్ష పూనారో అర్థంకాలేదు.

ఇదివరలో కూడా చాలాసార్లు యీ ప్రాంతానికి వన మూలికల కోసం వచ్చాడు తను! అప్పుడు యింతదూరం రానక్కర్లేకుండానే రోడ్డుకి దగ్గర్లో వున్న అడవి ప్రాంతంలోనే దొరికేవి. కాని ఎందుకో అడవి కొట్టేయటం జరిగింది కొంత మేర. తను ఎంతగాలించినా కావల సిన వేర్లు, మూలికలు దొరకలేదు. వాటిని వెతుక్కుంటూ దారితప్పి బాగా దూరంగా ఎక్కడో మారుమూలగా వున్న యీ గూడెం చేరుకున్నాడు.

ఇక్కడి ఆటవికులు మరీ యింత వెనకబడ్డవాళ్ళనీ, నరబలులిచ్చే ఘోరమైన సంప్రదాయం కలవాళ్ళనీ తనకు సూచన ప్రాయంగానైనా తెలీదు.

తను యిలా వాళ్ళ ప్రాంతంలో అడుగు పెట్టాడో లేదో అలా తనని పట్టి బంధించేశారు. తనేం చెప్తున్నదీ వినకుండా మూర్ఖంగా బలివ్వటానికే నిర్ణయించుకున్నారు. ఈ రెండు రోజులుగా రకరకాల తినుబండారాలు పంపిస్తూనే వున్నారు. కాని తను పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేదు.

రేపే బలిస్తారు తనని!

8

తెల్లవారింది.

"మాళీ, చెట్టు దిగుదామా?" అన్నాడు భార్గవ.

"ఇంకా బాగా వెలుగు రానివ్వు. ఆ పాటికి క్రూర మృగాలు సురక్షిత ప్రాంతాలకి పోయి దాక్కుంటాయి. మనకీ సురక్షితంగా వుంటుంది."

"అవును. ఈలోపల మనుషులు కూడా అటు యిటు మసలటం మొదలవుతారు. మనగోడు చెప్పుకుని దారి కనుక్కుని బయటపడదాం."

"కనుమాపు మేరలో ఎక్కడ చూసినా చెట్లు గుట్టలు తప్పితే మనుషుల జాడ వున్నట్టు కనపడలేదు."

"అడవి కదా, అలాగే అనిపిస్తుంది. గిరిజనులు చాలా కొద్ది సంఖ్యలో వుంటారు కదా! ఇంత పెద్ద అడవిలో కొండల మధ్య చిన్న చిన్న గూడెలు కట్టుకుని అలాగే బతుకులు వెళ్ళబుచ్చుతుంటారు. ఇంకా యిప్పుడిప్పుడు వాళ్ళు కూడా చదువుకుని ఉద్యోగాలకోసం పట్టణాలు వస్తున్నారు. వాళ్ళకోసం ప్రభుత్వం యెన్నో సదుపాయాలు రిజర్వేషన్లు కల్పిస్తోందికదా!"

"ఎస్, వాళ్ళు కూడా అభివృద్ధి చెందుతున్నారు."

"వెలుగు బాగా వచ్చింది, యిక దిగుదామా?"

ఇద్దరు చెట్టు దిగి వచ్చారు. రాత్రంతా నిద్రలేకుండా టెన్షన్‌తో, మానసిక వ్యథతో అలాగే కొమ్మలమధ్య భయం భయంగా కాలం గడపాల్సి రావటంతో ఇద్దరి శరీరాలు కాసేపటివరకు స్వాధీనంలోకి రాలేదు.

చుట్టూ కలయజూశారు. యెక్కడా నరసంచారం కనిపించలేదు. చెవులపిల్లులు, కుందేళ్ళు చాలా హాడా విడిగా పొదల్లోకి పొదల్లోంచి బయటకు గంతులు వేస్తూ పరుగులు పెడుతున్నాయి.

కింద ఎక్కడా కాలిబాట కూడా లేదు.

"పోయిన రాత్రి యీ డొంకలు తుప్పలు ఎలా దాటుకుని వచ్చామో నాకు చాలా చిత్రంగా వుంది."

"ప్రాణ భయం అలాంటిది మైడియర్ ఫ్రెండ్! ఏమై పోతున్నామో, యెక్కడికి పోతున్నామో ఆలోచించు కోవటానికి సావకాశం, సమయం వుండవు. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్! జీవన పోరాటం—అంతే!" ఫీరీ చెప్తున్నాడు వాళి.

"నిన్న సాయంత్రం మనం అర్జునతో వచ్చిన ఏరియా కాదిది. పూర్తిగా కొత్త ప్రదేశం."

"పద, తెలిసిన ప్రాంతం ఎదురుపడేవరకు వెతుకుదాం. ఈ లోపల ఎవరోకరు కనిపించకపోరు. అడిగి తెలుసుకుందాం."

"తాణేదారు నివాసం కూడా కనుచూపు మేరలో యెక్కడా కనపడటంలేదు. మా రేడుమిల్లికి ఈ ప్రాంతం ఏ దిశలో వుందో, ఎంత దూరంలో వుందో అంతా అగమ్యగోచరం."

"కబుర్లతో కాలం వ్యర్థం చెయ్యొద్దు. ఎలుగుబంటి పుణ్యమా అని కాసేపు పరుగుపందెం వేసుకున్నాం. మనం

చాలా వేగంగా పరుగెత్తగలమని నాకు నిన్న రాత్రే తెలిసింది. ఈసారి యింటర్నేషనల్ స్పోర్ట్సులో పాల్గొంటాను—రన్నింగ్ రేస్‌కి.

"అలాగే పాల్గొందువుగాని ముందు యీ అడవిలో నించి బయటపడనియ్ క్షేమంగా."

వాళ్ళిద్దరు కొద్దిదూరం వెళ్ళారో లేదో చెట్లమీది నుంచి నలుగురైదుగురు మనుషులు చటుక్కున వాళ్ళ ముందు ఉరికారు. వాళ్ళ చేతుల్లో బల్లేలున్నాయి. నడుంచుట్టు అంగవస్త్రంలా యేదో కట్టుకున్నారు. మెడలో పూసలున్నాయి. ఒంటిమీద మరే ఆచ్ఛాదనా లేదు.

మాలి, భార్గవ చటుక్కున ఆగిపోయారు.

"ఎవరు మీరు, యీడకెందుకొచ్చినారు? అన్నారు వాళ్ళు క్రూరంగా వాళ్ళిద్దరివంకా చూస్తూ.

భార్గవ గొంతు తడారిపోయింది. "మా తాలూకు ఓ మనిషికోసం వెతుకుతున్నాం. ఆయన యీ అడవిలోని కొన్ని మూలికలకోసం మూడు రోజుల క్రితం వచ్చారు. మీరుగాని చూశారా?...."

"భార్గవ మాటలింకా పూర్తికానేలేదు, యిద్దరు మనుషులు అతని పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు. చేతులు మొదల్లోకి విరిగిపోయాయా అన్నంత బాధ కలిగింది భార్గవకు.

మరో యిద్దరు మాలికి అదే సన్మానం చేశారు.

"ఇదేమిటయ్యా బాబూ, మేము చెప్పేది పూర్తిగా వినిపించుకోకుండా యిలా చేతులు విరిచేస్తున్నారు? కాస్త మేం చెప్పేది...."

మధ్యలోనే ఒకడు గట్టిగా కసురుకున్నాడు.

"అయ్యన్నీ మా దొరతో చెప్పుకొండహె. మీ యిసయం ఆడే జూస్కుంటాడు" అన్నాడు.

భార్గవ, మాళి వాళ్ళకు నచ్చచెప్పటం వృథా ప్రయాస అన్న నిర్ణయానికొచ్చి మౌనం వహించారు.

వాళ్ళు ముందు వెనక నడుస్తుండగా చాలా దూరం నడిచి నడిచి ఓ కొండను చుట్టి ఓ లోయలాంటి ప్రదేశానికి చేరారు.

9

"ఈళ్ళెవరు?" గూడెం నాయకుడు హుంకరిస్తున్నట్టు అడిగాడు.

"మొన్నొచ్చిన మడిసిలాంటోళ్ళే దొరా. అక్కడ తచ్చాడతాంటే తోల్కొచ్చినం" అన్నారు ఆటవికులు. మాళి, భార్గవ వాళ్ళవంకే పరీక్షగా చూస్తున్నారు.

తాము చూసిన కోయివాళ్ళకన్న వీళ్ళు బాగా వెనక పడినవాళ్ళలాగా వున్నారు. చాలా క్రూర స్వభావమున్న వాళ్ళలా కనిపిస్తున్నారు. తాము వీళ్ళకేదో అపకారం చేయదలచుకున్నట్టు వీళ్ళు భయపడుతున్నారా, లేక వీళ్ళ నైజమే అంతనా?—అన్న విషయం వాళ్ళకు అంతు బట్టలేదు.

"ఎందుకొచ్చినరు, యీడ మీకేం పని?" అంటూ చాలాసేపు వాళ్ళిద్దర్నీ ప్రశ్నలవర్షంలో ముంచెత్తాడు.

మాళి, భార్గవ చెప్పిన విషయాలు అతని తలకెక్కలేదు. చెప్పి చెప్పి విసుగొచ్చింది వాళ్ళకి.

చివరికి నాయకుడు తేల్చి చెప్పేశాడు.

"ఈళ్ళనిగూడా ఆడితో కట్టిపారెయ్యండహె! ఈ రోజు అమ్మోరి జాతర మాంచి జోరుగ సాగాలి. కొండ దేవరకి మూడు పేనాలతో యిందుజెయ్యాల" అన్నాడు

నాయకుడు హుంకరిస్తూ.

వాళ్ళు తమని ఏం చెయ్యబోతున్నారో మాలికి, భార్గవకు అర్థమైపోయింది.

నాయకుడి ఆదేశం ప్రకారం ఆటవికులు వాళ్ళిద్దర్నీ తీసుకుపోయి ఓ గుహలో పడేశారు. కొండని తొలిచి మలిచినట్టుందా గుహ. లోపల కటిక చీకటి. యేదో దుర్గంధం నాసికాపుటల్ని బద్దలుకొడుతోంది.

కాసేపటివరకు వాళ్ళ కళ్ళు చీకటికి అలవాటు పడలేదు.

కళ్ళు చికిలించి చూసేసరికి తమతోపాటు మరో వ్యక్తి ఉనికి కూడా వాళ్ళకు కనిపించింది.

ఆ వ్యక్తి ఒంటిమీద చిన్న అంగవస్త్రం తప్ప మరే ఆచ్ఛాదనా లేదు. ఒంటినిండా ఏవేవో పసర్లు, పూతలు, విబూతితో గీసిన నామాలు వున్నాయి. మెడలో పూల దండలు, ఆకులు తీగెలతో అల్లిన దండలు వున్నాయి. కాళ్ళకు కూడా యేవో అల్లికలు, నుదుట — దాదాపు ముఖానికంతకూ — సింధూరంతో గుర్తు తెలీకుండా బొట్లు పెట్టబడి వున్నాయి.

ముందుగా ఆ వ్యక్తే గుర్తుపట్టి పలకరించాడు.

"భార్గవా, నువ్వా? ఆ పక్క మీ స్నేహితుడు మాలి కదూ!" అన్నాడు.

భార్గవ తదేక దీక్షగా చూసి, "సార్, మీరేనా? ఏమిటీ అలంకరణలు? మిమ్మల్ని వెంటనే గుర్తుపట్టలేక పోయాం" అన్నాడు. ఆయన ప్రొఫెసర్ జయవంత్.

మాలి కూడా ఆనందంగా చూశాడాయనవంక. "మిమ్మల్నిలా చూడటం బాధాకరంగానే వున్నా, మిమ్మల్ని చూడగలిగినందుకు చాలా సంతోషంగావుంది"

అన్నాడు.

ఒకరితో మరొకరు తన అనుభవాలు చెప్పుకున్నాక ప్రొఫెసర్ జయవంత్ అన్నాడు.

"వీళ్ళు చాలా ప్రమాదకరమైన ఆటవికులు. ఈ రోజుల్లో కూడా యింత క్రూరమైన అడవి మనుషులు వుంటారని మనం కనీసం వూహించలేం. ప్రతి ఏజెన్సీ ప్రాంతంలోను ప్రభుత్వం అనేక రకాల సదుపాయాలు, సౌకర్యాలు సమకూర్చింది. అయినా యింకా యింత అజ్ఞానంతో, మూర్ఖత్వంతో మారుమూల పడున్న కోయ గూడేలున్నట్టు బహుశా ప్రభుత్వానికి కూడా తెలీదేమో! ఇది మా పేడుమిల్లికి దగ్గర్లోనే వుంది. కాకుంటే బాగా రవాణాసౌకర్యంగాని ఓ మూలను విసిరేయబడి వుందీ ప్రాంతం! ఇక్కడి మనుషులు బాగా అనాగరికులు, కొండదేవత ఉపాసకులు. నరబలులు వీళ్ళకు సర్వసాధారణం. బహుశా నరమాంస భక్షణకు కూడా వీళ్ళు దూరంకాదని నా అనుమానం! ఆ బలి కార్యక్రమంలో ప్రస్తుతం ఈనాటి బలి పశువును నేను! ఈ రోజు వీళ్ళ కొండ దేవతకు యేదో జాతరట! అందుకు నన్ను రెడీ చేసుకున్నారు" అన్నాడు.

ప్రొఫెసర్ చెప్పిన విషయాయి తమ అనుభవంతో అన్వయించుకున్నారు వాళ్ళిద్దరు.

"బహుశా మాక్కూడా కొద్ది నిమిషాల్లో మీకు చేసిన మర్యాదే చెయ్యబోతున్నారు వీళ్ళు. ఈ గూడెం నాయకుడు ఇందాకా చెపుతున్నాడు. యీ రోజు మూడు ప్రాణాలని బలిపెట్టబోతున్నట్టు!" అన్నాడు భార్గవ.

వీళ్ళ దారుణకృత్యానికి బలికాక తప్పదని నిరాశపడి

పోయాను. ఇంతలో మీరొచ్చారు. మనం ఎలాగైనా ఇక్కడినుంచి తప్పించుకోవాలి. వీళ్ళ చేతుల్లో నిర్భాగ్యపు చావు చావకూడదు. ఈ గూడెం నుంచి మారేడుమిల్లి యే దశలో వుందో, యే దారిన అక్కడికి చేరుకోవచ్చో నేను బాగా స్టడీ చేశాను. వీళ్ళ బంధనాలనుంచి తప్పించుకోగలిగితే ఒక్క గంటలో మనం సురక్షిత ప్రాంతానికి చేరుకోవచ్చు" అన్నాడు జయవంత్.

"అదెలా? వీళ్లు కాలు కదిపితే కాళ్ళు విరగ్గొట్టి పొయ్యిలో పెట్టేసేలా వున్నారు. పైగావాళ్ళు దాదాపు ఓ వందమంది వుంటారేమో అంతా కలిసి. మనం ముగ్గురం. వాళ్ళ చేతుల్లో కత్తులు బళ్ళేలూ వున్నాయి. మనం నిరాయుధులం!" అన్నాడు మాళి.

"అయితే మీ దగ్గర ఎలాంటి ఆయుధాలు లేవన్న మాట!" అన్నాడు ప్రొఫెసర్.

"మిమ్మల్ని జాడ తెలుసుకోవటానికి ఉన్నపళంగా బయల్దేరి వచ్చేశాం. ఇలాంటి రాక్షసుల పాలబడతామని ముందుగా మాకేం తెలుసు?" అన్నాడు భార్గవ.

"నాకు తెలుసు. గతంలో మరోచోట ఇలాంటి అనుభవమే యెదురైంది నాకు. అయితే వాళ్ళు యింత ఘోరంగా 'బలి' యేర్పాటు చెయ్యలేదు. వాళ్ళ ప్రాంతంలోనికి యెందుకొచ్చావని పట్టుకుని వేధించి వదిలేశారంతే! అప్పట్నించీ ఇలా కలెక్షన్స్‌కి వచ్చినపుడు రివాల్వర్ వెంట తెచ్చుకుంటాను" అన్నాడు జయవంత్.

"అయితే మీ దగ్గర రివాల్వర్ వుందా ఇప్పుడు?" భార్గవ గట్టిగా అరిచినట్టే అడిగాడు.

"ఉష్! .... మనకి కొన్ని అడుగుల దూరంలోనే కాపలా మనుషులున్నారన్న విషయం మరిచిపోవద్దు.

వాళ్ళు వింటే అంతా రసాభాసవుతుంది.... నా బ్రీఫ్ కేసులో వుంది రివాల్వర్. నేను కలెక్టు చేసిన మూలిక లతోబాటు దాన్ని బ్రీఫ్ కేసులో దాచాను. అయితే ఆ బ్రీఫ్ మాత్రం ప్రస్తుతం నా దగ్గర లేదు."

మాళి, భార్గవ నీరసపడిపోయారు.

"మరెలాగ?" అన్నారు ఒకేసారి.

"అది ఈ గుహాలోనికి నేనొచ్చేవరకు నా దగ్గరే వుండేది. వచ్చేముందు నేనే ఈ గుహకి కుడిపక్కన వున్న బండరాళ్ళ వెనకాల జారవిడిచి వచ్చాను. అది బండలమధ్యనున్న జాగాలో సురక్షితంగానే వుంటుంది. వీళ్ళకి బుర్ర తక్కువ. అది అప్పటిదాకా నా చేతిలోనే వుందనిగాని, అది యేమయిందిగానీ పట్టించుకోలేదు" అన్నాడు ప్రొఫెసర్.

"మరి దాన్ని ఎలా చేజిక్కించుకోవటం?"

"అదే ఆలోచించాలి. మనం ఒక్క అడుగు కూడా ముందుకు జరపలేని హీనస్థితిలో వున్నాం. వేటకుక్కల్లా చర్యల్ని అనుక్షణం కనిపెడుతున్నారు వీళ్ళు! ఏమాత్రం అనుమానం వచ్చినా అమ్మవారికి కాదు, యిక్కడి కిక్కడే బలి కార్యక్రమం ముగించేస్తారు. చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి!"

ముగ్గురు కాసేపు తీవ్రమైన ఆలోచనలో పడ్డారు.

"అయితే ఒక్క రివాల్వర్ సహాయంతో వీళ్ళందరి నుంచీ తప్పించుకోగలమా?" అన్నాడు భార్గవ సందేహం వెలిబుచ్చుతూ.

"అసలు ఏమీ లేకుండా పోయేకన్న ఏదొక ఆధార ముందికదా! ఒకటి రెండు గుళ్ళు పేల్చేసరికి వాళ్ళేదారి కొస్తారు భయపడి!"

"ఏమో, చూడగా వీళ్ళలో భయంకరమైన మంత్రగాళ్ళు కూడా వున్నట్టున్నారు. రక్త తర్పణాలు విడిచి క్షుద్ర శక్తుల్ని ఉపాసిస్తున్న ఓ భయంకర మాంత్రికుడ్ని చూశాం. సమయానికి ప్రేతాత్మలని మనమీద వదిలేసినా వదిలెయ్యొచ్చు" అన్నాడు భార్గవ.

"డోంట్ బి సిల్లీ! ప్రేతాత్మలు, దయ్యాలు అంటూ వెనుతియ్యటానికి నీకు సిగ్గు వెయ్యటంలేదూ? నీ విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం యేమయిపోయింది? ఇలాంటివి నమ్ముతావా?" అన్నాడు ప్రొఫెసర్ మందలింపుగా.

భార్గవ మాట్లాడలేదు.

కాసేపు ముగ్గురు లోస్వరంలో అక్కడినుంచి తప్పించుకునే సమస్యగురించి చర్చించుకున్నారు.

10

గంట తర్వాత నలుగురు ఆటవికులు నాయకుడితో కలిసి అక్కడికొచ్చారు.

వాళ్ళ చేతుల్లో కొబ్బరి చిప్పలున్నాయి. వాటిలో రకరకాల రంగులు, పసర్లు, లేపనాలు వున్నాయి. వారి వెనుక యిద్దరు ఆడవాళ్ళు—వచ్చారు. వాళ్ళ చేతుల్లో పూసల పేర్లు, సింధూరం ఇంకా నారబట్టలు వున్నాయి.

జయకంత్ కళ్ళతోనే మాళికి, భార్గవకు సంజ్ఞ చేశాడు. అంటే బలి కార్యక్రమం మొదలయిందని ఇద్దరికీ అర్థమయింది.

"గుడ్డలిప్పెయ్యండి" ఆజ్ఞ ధ్వనించింది నాయకుడి కంఠంలో.

మాళి, భార్గవ ముఖాలు చూసుకున్నారు.

"ఊఁ, చెపుతుంటే ఇనబడలే!" హూంకరించాడు నాయకుడు. అతని చేతిలోని బరిసె వాళ్ళ గుండెలని

చీల్చేయటానికి సిద్ధంగా వున్నట్టుంది.

జయవంత్ కళ్ళతోనే సంకేతాలు పంపాడు.

భార్గవ గుడ్డలు ఒకటొకటే విప్పసాగాడు.

మాలి లేచి నాయకుడి దగ్గరగా వెళ్ళబోతుంటే, "ఎందుకు? అక్కడే గుడ్డిప్పు" అన్నాడు నాయకుడు.

మాలి తనకు పడ్డ అవసరం వేలితో సూచించాడు.

అనుచరుడికి సైగ చేశాడు నాయకుడు. మాలి వెంట వాడు బయలుదేరాడు.

మాలి జయవంత్ చెప్పిన బండల వెనక్కు వెళ్ళాడు. అయిదు నిమిషాల తర్వాత బయటికొచ్చాడు.

అనుచరుడు మళ్ళీ వెంబడించాడు గుహ లోపలివరకు.

మాలి లోనికొచ్చేసరికి భార్గవకు బలితంతు జరుగుతోంది. లేపనాలు పూస్తున్నారు. సింధూరం బొట్లు పెడుతున్నారు. భార్గవ లోపల్నుంచి తన్నుకొస్తున్న కోపాన్ని బలంగా నిగ్రహించుకుని మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తున్నాడు.

"గుడ్డిప్పు" అన్నాడు నాయకుడు మాలితో.

మాలి గుడ్డలు విప్పసాగాడు. బనీను లోపల రివాల్వర్ చుట్టేశాడు. గుడ్డలు విసురుతున్నట్టుగా జయవంత్ ఒళ్లోకి విసిరాడు.

జయవంత్ లాఘవంగా రివాల్వర్‌ని తన కాళ్ళ కిందుగా దాచేసి గుడ్డల్ని పక్కకి పారేశాడు.

నాయకుడుగాని, అనుచరులుగాని ఇదేమీ గమనించలేదు.

ఓ గంటతర్వాత తంతు ముగిసింది.

ఇంతలో గుహ బయట పెద్ద కోలాహలం. డప్పుల మోతలు, బాకాలు కర్ణకఠోరంగా వినిపిస్తున్నాయి.

గూడెంలోని పిల్లాపీచు, ఆడ మగ అందరూ గుహ బయట చేరారు. దాదాపు అందరూ మద్యం సేవించి నట్టుంది. ముక్కుపుటాలు దుర్వాసనతో అదిరిపోయాయి వాళ్ళకి.

"పదండి, మీ దేవతల్ని తల్చుకోండి. మీ ఆఖరి క్షణాలు దగ్గరడ్డాయి. లెగండెహె!" అన్నాడు నాయకుడు.

జయవంత్ నడుముకున్న గుడ్డలో జాగ్రత్తగా రివాల్వర్ని భద్రపరిచాడు. మాళి, భార్గవ మౌనంగా లేచి జయవంత్‌తో బాటు బయటకు నడిచారు.

బాకాల మోతలు, డప్పుల మోతల అంతకంతకు తారస్థాయిని చేరుకుంటున్నాయి. మధ్యలో ఎక్కడా వాళ్ళకు తప్పించుకునే అవకాశం దొరకలేదు.

దాదాపు పదినిమిషాల తర్వాత వాళ్ళు ముగ్గుర్ని ఓ నిలువెత్తు విగ్రహామున్న ప్రదేశానికి తీసుకుపోయారు. ఆ విగ్రహామే వాళ్ళ కొండదేవతయి వుంటుందని వాళ్ళు గ్రహించారు.

విగ్రహాం ముందు నించుని వున్న వ్యక్తిని చూడగానే మాళి, భార్గవ ఉలిక్కిపడ్డారు.

అతను తామిదివరకు చెట్టుకింద చూసిన మంత్రగాడు! క్షుద్ర దేవతా ఉపాసకుడు. ఈ బలితంతు వాడే కొనసాగిస్తాడు కాబోలు!

వాళ్ళ శరీరాలు గగుర్పొడిచాయి. ఆ మంత్రగాడు చాలా భయంకరంగా వున్నాడు. నిన్న చూసినదానికన్నయింకా భయోత్పాదం కలిగించేలా వున్నాయి వాడి అలంకరణలు! ఈసారి కపాలాలను దండ గుచ్చి మెడలో ధరించాడు.

జయవంత్ కళ్ళతోనే మాళికి, భార్గవకు సంకేతాలు పంపిస్తున్నాడు.

ఆటవికులందరు మహోత్సాహంతో అరుస్తున్నారు. నాట్యం చేస్తున్నారు.

విగ్రహం ముందు హోమం తయారుచేసి అందులో రకరకాల వేర్లు, రక్తం యెండుకట్టెలు సమిధలుగా వేస్తున్నారు మంత్రగాడు.

నలుగురైదుగురు అనుచరుల చేతుల్లో ఆయుధాలున్నాయి—బల్లాలు. నాయకుడి చేతిలో పొడవాటి దండం వుంది! దాన్ని మాటిమాటికీ గాల్లో ఊపుతున్నాడు—మంత్రదండంలాగా.

జయవంత్ పరిస్థితి జాగ్రత్తగా గమనిస్తున్నాడు. దాదాపు అందరు తన్మయత్వంతో ఏదో పాట పాడుతూ వికట నాట్యం చేస్తున్నారు. తాము ఎటాక్ యిచ్చినా వాళ్ళు పొజిషన్‌లోకి వచ్చి తమ దాడి నెదుర్కోవటానికి ఎటూ కొంత టైం తీసుకుంటుంది. ఆ కాస్త సమయాన్ని మెలకువగా ఉపయోగించుకోవాలి.

జయవంత్—ఏం చెయ్యాల్సింది ముందుగానే మాళికీ, భార్గవకీ చెప్పి వున్నాడు. వాళ్ళు కాషన్‌గానే వున్నారని నిర్ధారణ చేసుకున్నాడు.

డప్పుల మోత, బాకాల మోత కర్ణభేరిని పగలగొట్టేటంత ఉచ్ఛస్థాయికి చేరిపోతున్నాయి. నాట్యంలో వేగం పెరిగింది.

మంత్రగాడు కూడా లయబద్ధంగా ఊగుతున్నాడు. కుడిచేతిలోకి పొడవాటి పదునైన కత్తిని తీసుకున్నాడు. విగ్రహం పాదాల చెంతనుంచి.

నాయకుడివంక చూశాడు మంత్రగాడు.

నాయకుడు జయవంత్‌ని సమీపించి, అతని మెడమీద చెయ్యివేసి వధ్యశిలదగ్గరకు మెల్లగా తీసుకుపోసాగాడు. భార్గవని, మాళిని దాటివెళ్తూ జయవంత్ మాళికి రివాల్వర్‌ని లాఘవంగా అందించాడు.

జయవంత్‌ని వధ్య శిలమీద మెడనొక్కి పట్టాడు నాయకుడు.

"సివరగా అమ్మోరిని పేర్దన సేస్కో!" అన్నాడు నాయకుడు జయవంత్ నుద్దేశించి.

మంత్రగాడు పూనకం వచ్చినట్లు ఊగిపోతున్నాడు. చేతిలోని కత్తిని గాలిలో తిప్పుతున్నాడు.

వధ్య శిలని సమీపించాడు. మరుక్షణంలో జయవంత్ తల మొండెంనుంచి వేరు పడేదే!

కాని మాళి చేతిలోని రివాల్వర్ రెండుసార్లు గర్జించింది. ఓ గుండు మంత్రగాడి చేతిలోని కత్తిని జారిపోయేలా చేసే మరోగుండు మంత్రగాడి గుండెల్లోంచి దూసుకుపోయి వాడిని అమాంతం నేల కూల్చేసింది.

జయవంత్ మెరుపులా లేచాడు.

"డోంట్ వేస్టు బులెట్స్. రన్ వే! ఫాలోమీ" అంటూ లేడిలా ముందుకి ఉరికాడు జయవంత్.

పరిస్థితి గ్రహించి ఆటవికులు వెంటబడే లోపల ఫర్లాంగు దూరం పారిపోయారు ముగ్గురూ. చేత బల్లేలున్న నలుగురు ఆటవికులు ముందుగా వాళ్ళని వెంటాడారు. ముగ్గురూ దాటిపోతున్నారని అనుమానం రాగానే చేతుల్లోని ఆయుధాలు గురిచూసి వాళ్ళమీద్దకు విసిరారు.

ప్రమాదాన్ని ముందుగానే వూహించిన ముగ్గురూ అమాంతం నేలమీద బోర్లా పడిపోయారు. వాళ్ళ వీపుల మీదుగా సర్రున దూసుకుంటూ పోయి నేలమీద పడి

పోయాయి బళ్ళెలు.

మాలి వెంటనే నలుగురిమీద ఒకరివెంట మరొకర్ని నిర్దాక్షిణ్యంగా రివాల్వర్‌తో కాల్చేశాడు.

నలుగురు అనుచరులు నేల కూలిపోయారు.

దూరంగా గూడెం అంతా ఉప్పెనలా కదిలిరావటం కనిపించింది.

జయవంత్ లేచాడు. మాలి, భార్గవ కూడా లేచారు.

"మన గుడ్డలు తెచ్చుకోవద్దా?" అనబోయిన భార్గవ జయవంత్ ఉరిమి చూడటంతో మళ్ళీ నోరెత్తలేదు.

"హారియవ్, వాళ్ళు దగ్గరకొచ్చేస్తున్నారు. రెండు మైళ్ళు వేగంగా పరుగెత్తాలి. మారేడుమిల్లి రోడ్ కనెక్షన్‌కొస్తే చాలు, మనం బతికిపోయినట్టే!" అన్నాడు జయవంత్ పరుగుపెడుతూ.

మాలి, భార్గవ ఆయన్ని అందుకోలేక వెనక పడిపోతున్నారు.

వెనక గూడెం జనం అంతకంతకు దగ్గరపడుతున్నారు. అందులోనించి యిద్దరు మహావేగంగా బల్లెలు పట్టుకుని పరుగెత్తుకొస్తున్నారు. ఏ క్షణాలలోనైనా వాళ్లు తమని అందుకునేలాగా వున్నారు.

"ఇంకో ఫర్లాంగు దూరం పరుగెడితే చాలు, రోడ్ కొచ్చేస్తాం. హారియవ్!" అన్నాడు జయవంత్.

ఇంతలోనే ఓ బల్లెం వేగంగా వచ్చి మాలి కాలికి తగిలింది. అతను అమాంతం ముందుకు పడిపోయాడు. బల్లెం అతని కాల్లో గుచ్చుకుంది.

సరిగ్గా అదే సమయంలో రోడ్ క్రాసింగ్ దగ్గర్నుంచి ఓ లారీ అటే వస్తోంది.

జయవంత్ వెనక్కి చూశాడు. గూడెం జనం వెను

తిరిగి పారిపోతున్నారు. వాళ్ళు లారీని చూసినట్టుంది.

భార్గవ లారీ ఆపేశాడు. డ్రైవరు పక్కనున్న వ్యక్తి ఆశ్చర్యంగా కిందికి దిగుతూ "మీరా?" అన్నాడు.

అతను సంతాల్! వీళ్ళ ముగ్గురి వేషాలు చూసి విస్తుపోయాడు.

మాళికి గుచ్చుకున్న బల్లెం లాగేశాడు సంతాల్. "మరేం ప్రమాదం లేదు. ఇక్కడ హాస్పిటల్ వుంది. పదండి వెళ్దాం" అన్నాడు.

జయవంత్ మాళివంక ప్రశంసగా, జాలిగా చూశాడు. మాళి హీనస్వరంతో మెల్లగా నవ్వాడు.

అర్జున గురించి ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు భార్గవ. నరబలులిచ్చే ఆ గూడెం గురించి, ప్రభుత్వాన్ని దోచుకుంటున్న ఫారెస్టు తాణేదారు గురించీ కూడా ఆలోచిస్తున్నాడు—ఎలా పట్టించాలా అని!

—:అయిపోయింది:—